17వ
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం,26 మార్చి 2024


# జిల్లావ్యాప్తంగా ముమ్మరంగా నాకాబందీ కార్యక్రమం

- స్వయంగా వాహన తనిఖీ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ




**కాకినాడ, మేజర్ న్యూస్ :** రాబోవు సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాకినాడ జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీ కార్యక్రమం నాకాబందీని పోలీసులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం 5 గంటల నుండి కాకినాడ జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ ల పరిధిలోని ముఖ్య కూడళ్లలో నాకాబంది కార్యక్రమము నిర్వహించారు. అన్ని ముఖ్య కూడళ్ళ వద్ద పోలీసులు పెద్ద ఎత్తున మోహరించి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అన్ని వాహనాలను తనిఖీ చేశారు. నగదు, మద్యం అక్రమ రవాణా, మాదక ద్రవ్యాలు, చోరీ చోరీ చేసిన వాహనాలు మరియు సరైన పత్రాలు రికార్డు లేని వాహనాలు పై దృష్టి సారించి తనిఖీలు కొనసాగుచున్నవి.కాకినాడ జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఆదేశాలతో కాకినాడ జిల్లా అదనపు ఎస్పి శ్రీలక్ష్మి స్వయంగా ఈ నాకాబంది కార్యక్రమంలో పాల్గొని పర్యవేక్షించుచున్నారు. కాకినాడ, పెద్దాపురం సబ్ డివిజన్ పోలీస్ అధికారులు, సర్కిల్ ఇన్స్పెక్టర్లు, అన్ని పోలీస్ స్టేషన్ల పోలీస్ అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమములో పాల్గొని వాహన తనిఖీలు చేయుచున్నారు.

# ఈవో సంతకం ట్యాంపరింగ్‌పై విజిలెన్స్ నజర్..!


సూర్య
సత్యదేవుని దేవస్థానంలో...
ఈఓ సంతకం ట్యాపరింగ్ ?



భక్తుల కోర్కెలు తీర్చే సత్యదేవుని సన్నిధిలో పదోన్నతుల కోసం వ్రత పురోహిత విభాగంలో కొందరు వ్రత పురోహితులు అప్పటి ఈవో రామచంద్రమోహన్ సంతకాన్ని ట్యాంపరింగ్ చేసి అడ్డదారులు తొక్కుతూ నిబంధనలను కాలరాస్తూ అడ్డగోలు నేరాలకు పాల్పడ్డ వైనంపై విజిలెన్స్ శాఖ దృష్టి కేంద్రీకరించింది. వ్రత పురోహితులు ఎంతమంది ఉన్నారు, క్లాస్ త్రి నుంచి క్లాస్ టూకి పదోన్నతి పొందడంలో ఏం జరిగింది, సంతకాన్ని ట్యాంపరింగ్ చేసినవారిపై విచారణ పేరుతో కాలయాపన చేయడం వెనుక ఉన్న అధికారులు ఎవరు, ఎందుకు క్రిమినల్ కేసులు పెట్టలేదు, హైకోర్టు ఉత్తర్వులు రాకుండానే ఇందులో ఉన్న నేరగాళ్ళకు పదోన్నతులు ఎవరు ఇచ్చారు, ఎన్ని లక్షలు చేతులు మారాయి తదితర అంశాలపై లోతుగా విచారణ విజిలెన్స్ చేయనున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి 'సూర్య' కథనంతో విజిలెన్స్ కదలనుంది.

ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :

- పదోన్నతులు కోసం వ్రత పురోహితులు చేసిన నేరంపై విచారణ
- దీనిలో ఎవరెవరి పాత్రలపై ఫోకస్..
- సంతకాన్ని ట్యాంపరింగ్ చేసిన వ్రత పురోహితుల చరిత్రపై దృష్టి
- ఈవో రామచంద్రమోహన్ ను వివరణ కోరనున్న విజిలెన్స్
- ఈ నేరగాళ్ళపై క్రిమినల్ కేసులు పెట్టకపోవడం తదితరాలపై లోతుగా విచారణ

ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఈఓ సంతకం ట్యాంపరింగ్ విషయం ఇప్పుడు చర్చనీయాంశమైంది. దేవస్థాన పురోహితులు కొంతమంది అక్రమంగా పదోన్నతులు పొందడం కోసం ఈఓ రామచంద్రమోహన్ సంతకం ట్యాంపరింగ్ చేసినట్టు తెలిసింది.ఈ విషయంపై సూర్య ప్రత్యేక కథనం ప్రచురించడం జరిగింది. ఈ కథనంపై విజిలెన్స్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ దృష్టి సారించినట్లు సమాచారం. ప్రభుత్వ ఉద్యోగి సంతకం ట్యాంపరింగ్ చేయడం అంటే క్రిమినల్ కేసు పరిధిలోకి వచ్చే అంశం కనుక ఏ క్షణాన్నైనా విచారణ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దేవస్థానం అధికారులు ట్యాంపరింగ్ చేసినవారిపై ఏమైనా చర్యలు తీసుకున్నారా లేక ఉదాసీనత చూపారా అనే కోణంలో అధికారులను కూడా విచారణ జరిపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



# కిమ్స్‌లో అత్యాధునిక పరికరాలతో గుండెకు చికిత్స



**అమలాపురం,మేజర్‌న్యూస్:** కిమ్స్‌లో అత్యాధునిక పరికరాలతో గుండెకు చికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు మెడికల్ డైరెక్టర్ డా.హరి కిరణ్ వర్మ తెలిపారు. అంబాజీపేట కు చెందిన 57 సంవత్సరాల రోగి తీవ్రమైన ఛాతీ నొప్పితో 18 వ తేదీన కిమ్స్ గుండె వైద్య విభాగ వైద్యులు డా.అభిషేక్ రవి వర్మ ని సంప్రదించారు. రోగికి అవసరమైన పరీక్షలు జరిపి గుండెలో రక్తనాళాలు పూడుకొనిపోవడం వల్ల రక్త సరఫరా తగ్గి నొప్పి వస్తున్నట్లు గమనించారు. 22 వ తేదీన కిమ్స్ గుండె వైద్య నిపుణులు డా. అభిషేక్ రవివర్మ, డా. గురు కిరణ్, డా.నాగ గణేష్ లతో కూడిన వైద్య బృందం రోగికి అత్యాధునిక ఓ.సి.టి. పరికరం సహాయంతో రక్తనాళాలలోకి కెమెరాను పంపి, గుండె లోపలి రక్తనాళాల దృశ్యాలను తెరపై చూస్తూ స్టెంటు అమర్చి రక్తనాళాలలో రక్త సరఫరా పనితీరు మెరుగుపరచారని తెలిపారు. ఈ ఆధునిక పరికరం వలన బైపాస్ సర్జరీ చేయవలసిన అవసరం లేకుండా స్టెంట్ వేయడం సాధ్యమైందని, రోగి త్వరగా కోలుకోగలిగారని కార్డియాలిజిస్టు డా.అభిషేక్ రవివర్మ తెలిపారు. వైద్యుల పర్యవేక్షణలో పూర్తిగా కోలుకున్న రోగిని 25వ తేదీన ఆరోగ్యంగా ఇంటికి పంపుతున్నామని డా. అభిషేక్ రవివర్మ తెలిపారు. అత్యాధునిక చికిత్స అమలాపురం కిమ్స్ లో అందుబాటులో ఉండడం తమ అదృష్టమని రోగి బంధువులు సంతోషించారు. ఇటువంటి అత్యాధునిక పరికరాలతో గుండె చికిత్స చేసే విధానం కోనసీమలో తొలిసారిగా అందుబాటులోకి తీసుకొని వచ్చామని, స్థానిక ప్రజలందరూ ఈ ఆధునిక వైద్య విధానాల ప్రయోజనం పొంది ఆరోగ్యంగా ఉండాలని కిమ్స్ చైర్మన్ కె.వి.వి. చైతన్య రాజు, ఎం.డి. రవి కిరణ్ వర్మ, డీన్ డా.ఆనంద్ ఆచార్య మెడికల్ సూపరింటెండెంట్ డా.పి.సుబ్బారావు కోరారు. విజయవంతంగా శస్త్ర చికిత్స చేసిన గుండె వైద్య బృందాన్ని అభినందించారు.

# బీజేపీ కిసాన్ మోర్చ నాయకులను కలిసిన ఆనందరావు



**అమలాపురం, మేజర్ న్యూస్ :** బీజేపీ కిసాన్ మోర్చ జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లా పవన్ కుమార్‌ని ఆయన నివాసంలో అమలాపురం తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో తన గెలుపుకి సహకరించాలని ఆయన కోరారు. నల్లా పవన్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే మాకు ఆనందరావుతో సాన్నిహిత్యం వుందని, నేను విద్యార్థిగా ఉండగా ఆయన లెక్చరర్‌గా ఉండేవారని అన్నారు. ఆయన గెలుపుకు అహర్నిశలు కృషి చేస్తానని, తన అభిమానులు, స్నేహితులతో మరియు పార్టీ నేతలు ద్వారా ఆనందరావు అత్యధిక మెజారిటీతో గెలిచేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడ సొంబాబు, రాష్ట్ర వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి కర్రి రామస్వామి, దత్తుడు, మున్సిపల్ కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరరావు, రంకిరెడ్డి రామలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సీపిఐ నాయకులు బోగవల్లి నరశింహమూర్తి మృతి సీపీఐకు తీరనిలోటు



**పెరవలి,మేజర్‌న్యూస్:** సిపిఐనాయకులు బోగవల్లి నరశింహమూర్తి (దత్తుడు)క మ్యూనిస్టు ఆశయసాధనే లక్ష్యంగా అణగారిన వర్గాలు, రైతులు, వ్యవసాయ కార్మికుల అభ్యున్నతికి ఎనలేని కృషి నిర్వహించారని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కోనాల భీమారావు అన్నారు. సీపీఐ నాయకులు బోగవల్లి నరశింహమూర్తి (దత్తుడు) సంస్మరణ సందర్భంగా మార్చి 25వ తేదీ సోమవారం పెరవలి మండలం తీపర్రు గ్రామంలో వారి నివాసమందు బోగవల్లి నరశింహమూర్తి చిత్ర పటానికి భీమారావు పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడుతూ దేవాదాయ ధర్మాదాయ కౌలు రైతుల సమస్యలు పరిష్కారానికి, రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికి నరశింహమూర్తి ఎనలేని కృషి నిర్వహించారన్నారు. సీపీఐ తణుకు ఏరియా కార్యాలయం వంక సత్యనారాయణ సురాజ్య భవన్ నిర్మాణానికి విరాళాలు సేకరణలో తన వంతు కృషి నిర్వహించారన్నారు.పెనుగొండ నియోజకవర్గంలో సీపీఐ అభ్యర్థి వంక సత్యనారాయణ గెలుపుకు ఎనలేని కృషి చేశారన్నారు .జీవితాంతం కమ్యూనిస్టు ఆశయసాధనే లక్ష్యంగా జీవితాంతం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన నరశింహమూర్తి మృతి సీపీఐ కు తీర్చలేనిదని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు బోగవల్లి నరశింహమూర్తి కుమారులువెంకటేశ్వరరావు,చంటిబాబు,సీపీఐ నాయకులు నామాన వెంకటేశ్వరరావు, పంతం నాగేశ్వరరావు, రెడ్డి రామకృష్ణ,రంగినీడి ఆదినారాయణ,సైపురెడ్డి బాబ్జీ,గుత్తుల మహాలక్ష్మి, ఏఐటీయూసీ నాయకుడు కంతమనివెంకటేశ్వరరావు,మద్దిపాటి జానకిరామయ్య, కరుటూరి రామకృష్ణ,వెలగల భాస్కరరావు నర్శింహమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# ఎవరు ఎన్ని కుట్రలు చేసినా పిఠాపురంలో విజయం నాదే...

-నేను చేసిన అభివృద్ధి నన్ను గెలిపిస్తుంది
-పిఠాపురం నియోజకవర్గ వైఎస్ఆర్సిపి అభ్యర్థి వంగా గీత



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** ఎవరు ఎన్ని కుట్రలు చేసినా విజయం నాదే అని, పిఠాపురం నియోజకవర్గంలో నేను చేసిన అభివృద్ధి, సీఎం జగన్ మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు తనను గెలిపిస్తాయని పిఠాపురం నియోజవర్గ వైఎస్ఆర్సిపి అభ్యర్థి వంగా గీత విశ్వనాథ్ అన్నారు. పిఠాపురం పట్టణం స్థానిక ఎనిమిదో వార్డ్ డ్రైవర్స్ కాలనీలో స్థానిక ఎమ్మెల్యే పెండెం దొరబాబుతో కలిసి ఆమె పర్యటించారు. ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి వైఎస్ఆర్సిపికి మద్దతుగా నిలవాలని ఆమె ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ... పిఠాపురం నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజల్లోనూ తనకు మంచి ఆదరణ ఉందని, ఏ ఇంటికి వెళ్లినా తనను ఆ ఇంటిఆడపడుచుగా భావించితనను ఆదరిస్తున్నారని, పిఠాపురం నియోజవర్గంలో పాఠశాలలు, రైల్వే అండర్ బ్రిడ్జిలు నిర్మించామని, వంగజేతకు విషయం చెప్తే కచ్చితంగా చేసి తీరుతుంది అన్న నమ్మకం పిఠాపురం నియోజకవర్గ ప్రజల్లో బలంగా ఉందని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు శక్తివంచన లేకుండా పని చేస్తానని అన్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డి అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం చేస్తున్నారని, ప్రజల కొరకు, ప్రజల చేత ప్రజలచే అన్న పదానికి నిర్వచనం జగన్ అని తెలిపారు.

సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వాలంటీర్ వ్యవస్థలు ఈ దేశానికి ఆదర్శంగా నిలిచాయని, ఇటువంటి అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారుల కోసం సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనతసీఎంజగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నా రు. పిఠాపురం ప్రజల ఆదరణ నాపై ఎల్లప్పుడూ ఉంటుందని, రానున్న ఎన్నికల్లో విజయం తమదేనని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# దేవాదాయ అర్చకులపై దాడి

- నిమిషాల వ్యవధిలో స్పందించిన కమిషనర్
- పట్టించుకోని డీఈఓ



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఓ మాజీ కార్పొరేటర్ అర్చకులపై వీరంగం సృష్టించాడు. కాళ్లతో తన్ని బండబూతులు తిట్టి రెచ్చిపోయాడు. ఈ సమాచారం తెలుసుకున్న కమిషనర్ ఐదు నిమిషాల వ్యవధిలోనే స్పందించారు. కానీజిల్లా ఎండోమెంట్ ఆఫీసర్ పట్టించుకోలేదు. దీంతో పోలీసులు కూడాసంబంధంలేనిసెక్షన్ పెట్టి చేతులు దులిపేసుకున్నారు. కాకినాడ దేవాలయం వీధిలోని పెద్ద శివాలయంలో సహాయ అర్చకునిగా సాయిపని చేస్తున్నారు. పక్కనే ఉపాలయంలో మరో అర్చకులు విజయ కుమార్ పనిచేస్తున్నారు. ఇదిలా ఉంటే సోమవారం పౌర్ణమి కావడంతో భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి విచ్చేసారు. అదే సమయంలో మాజీ కార్పొరేటర్ సిరియాల చంద్రరావు ఆలయానికి వచ్చారు. స్వామివారికి కొబ్బరికాయ, పాలు తీసుకువచ్చారు. ఆలయం లోపల లింగంపై ఆ పాలు అర్చకులు పోసారు. ఈలోగా చంద్రరావు లింగంపై పాలు పడడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్చకుడు సాయి బదులిస్తూనే ప్రసాదం ఇస్తాను ఉండండి అన్నారు. నాకు ఎదురు చెబుతావా అంటూ అక్కడే అంతరాలయంలోనే అర్చకుడిని చాచి లెంపకాయ కొట్టాడు. ఇదేమిటి అని ప్రశ్నిస్తే బయటికి తీసుకొచ్చి కాలితో తన్నాడు. దీనిని అడ్డుకునేందుకుప్రయత్నించిన మరో అర్చకుడు విజయ్ కుమార్‌ని కూడా చెంపపై కొట్టాడు. బండ బూతులు తిడుతూ మీ అంతు చూస్తానంటూ వీరంగం సృష్టించాడు. ఇక్కడే అధికారులు తమ కక్కుర్తి బుద్ధి చాటుకున్నారు.ఎక్కడైతే ఘర్షణ జరిగిందో అక్కడ సీసీ కెమెరా పని చేయకుండా నిలిపివేశారు.మొత్తం16 కెమెరాలు ఉంటే ఐదుకెమెరాలుపనిచేయడంలేదు.గొడవజరిగిన విషయం దేవాదాయ శాఖ రాష్ట్ర కమీషనర్‌రాముసత్యనారాయణ, జాయింట్‌కమిషనర్ విజయ రాజు,జిల్లాఎండోమెంట్ ఆఫీసర్ పులినారాయణమూర్తి, కాకినాడ డివిజన్‌ఇన్స్పెక్టర్ వడ్డి పనింద్ర కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లా ఎండోమెంట్ ఆఫీసర్‌గా బాధ్యత తీసుకోవలసిన నారాయణమూర్తి తనకు సంబంధం లేదు, డిప్యూటీ కమిషనర్‌తో మాట్లాడుకొండని నిర్లక్ష్యంగా బదులిచ్చారు. ఇన్స్పెక్టర్ ఫణీంద్ర కుమార్ వెంటనే అక్కడికి చేరుకున్నారు. వివాదం వివరాలు అడిగి తెలుసుకున్నారు. అర్చకునికి రక్షణ చేకూరేలా జరిగిన సంఘటనపై పోలీసుకేసుపెట్టాలని ఆయన ఈవో రాజేశ్వరరావుకు సూచించారు. అర్చకులు నుంచి రాతపూర్వకంగా ఫిర్యాదు తీసుకుని ఈవో రాజేశ్వరరావు కాకినాడ1 టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కమిషనర్ సత్యనారాయణ రెండుసార్లు ఫోన్ చేసి చర్యలు తీసుకున్నారా లేదా కూడా అడిగారు. కానీజిల్లా ఎండోమెంట్ ఆఫీసర్ నారాయణమూర్తి ఏమాత్రం పట్టించుకోలేదు .డిప్యూటీ కమిషనర్ విజయరాజుఈఓతో ఫోన్లోమాట్లాడి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇదిలా ఉంటే వన్ టౌన్ పోలీసులు కూడా ప్రభుత్వ ఉద్యోగిపై దాడి అంటూ కేసు పెట్టారు. అర్చకుడు ప్రభుత్వ ఉద్యోగి కాదుఅయినాఔట్సోర్సింగ్‌లో పనిచేస్తున్నా రు. దీంతో ఈ కేసు వీగిపోతుందని అర్చక సంఘాలు చెప్తున్నాయి. ఇద్దరు అర్చకులు ప్రభుత్వ ఉద్యోగులుగా రారు.దీంతో నిందితుడిని కాపాడేందుకు ఒత్తిళ్ళ మేరకు పోలీసులుఈసెక్షన్ పెట్టినట్లుగా ఆరోపణ వినిపిస్తున్నాయి. పౌర్ణమి సోమవారం రోజు శివునికి అభిషేకం చేస్తున్న అర్చకులను అదే శివాలయంలో కాళ్లతో తన్ని చెంప దెబ్బలు కొట్టి బండబూతులు తిట్టిన మాజీ కార్పొరేటర్ ను రక్షించే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఇక్కడ జరిగిన వ్యవహారాన్ని భక్తులు తీవ్రంగా ఖండించారు. గొడవ జరిగిన చోట సీసీ కెమెరా ఎందుకు పనిచేయలేదు చెప్పాలంటూ నిలదీశారు. అయినా దేవాదాయశాఖఅధికారులనుంచిస్పందనలేదు. ఈ సమాచారం తెలిసిన వెంటనే దేవాదాయశాఖ రాష్ట్ర సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్, అఖిలభారత బ్రాహ్మణ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు ద్రోణంరాజు రవికుమార్,ఆలయదర్శనిఎడిటర్ క్ష్మణరావు తదితరులు స్పందించారు. అర్చకులకు న్యాయం జరగకపోతే నేరుగా రంగంలోకి దిగుతామన్నారు. రవికుమార్ ఏలూరు రేంజ్‌డిఐజి,కాకినాడ డిఎస్పీలతో మాట్లాడారు. ఇంత జరిగినా పోలీసులు మాత్రం సంబంధం లేని కేసు పెట్టడం అర్చక బ్రాహ్మణసంఘాలను ఆవేదనకు గురిచేస్తోంది.

# కౌంటింగ్ సెంటర్‌ను సందర్శించిన ఆర్వో



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ జే. వెంకటరావు ఆదివారం జేఎన్టీయూకే ఆవరణలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్ లను సందర్శించారు. పలువురు ఎన్నికల సిబ్బంది,అధికారులతో కలిసి సివిల్ బ్లాక్ లోని ఆయా కేంద్రాలను పరిశీలించిన ఆర్ఓ అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. అవసరమైన సదుపాయాలన్నీ ఉన్నాయో లేదో ఆరా తీశారు. ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. విధి నిర్వహణలో ఉండే సిబ్బందికి,స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలలో ఎటువంటి అసౌకర్యం లేకుండా అవసరమైన అన్ని సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఏఆర్ఓ దొర, ఎలక్షన్ డిటీ సీతాపతి రావు, ఏఈ రమేష్, సర్వేయర్ ఆచార్యులు, శానిటరీ సూపర్వైజర్ జిలాని, శానిటరీ ఇన్స్పెక్టర్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

సూర్య
తూర్పుగోదావరి
మంగళవారం
26 మార్చి 2024
5

## అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమలగా విరాజిల్లుతున్న వెంకటేశ్వరస్వామివారి ఆలయంలో నిర్మిస్తున్న అన్నదాన భవన నిర్మాణానికి సోమవారం ఆత్రేయపురం గ్రామానికి చెందిన సాగిరాజు సూర్య తేజ రూ.1,01,116 లు విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, డిప్యూటీ కమిషనర్ భూపతి రాజు కిషోర్ కుమార్, కమిటీ సభ్యులు, సిబ్బంది స్వామి వారి చిత్రపటాన్ని అందించారు.

## ఓటు హక్కు వినియోగంపై వినూత్నంగా అవగాహన




**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ఓటు హక్కు నిష్పక్షపాతంగా బాధ్యతాయుతంగా వినియోగించేలా ప్రతి ఒక్కరు అవగాహన కల్పిస్తూ ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో వినూత్నంగా హెూలీ నిర్వహించారు. సాధారణ 2024 ఎన్నికల నేపథ్యంలో బాధ్యతయుతమైన ఓటు హక్కు వినియోగంపై తహసీల్దార్ ఎం.వెంకట రామయ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఓటు వేసేందుకు వినియోగించే వేలుకు రంగులు వేస ప్రకృతి సంబంధమైన రంగులతో హెూలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, గ్రామ రెవిన్యూ అధికారులు, గ్రామ సహాయకులు పాల్గొన్నారు.

# ఏ విధమైన ప్రచారాలకైన అనుమతులు తప్పనిసరి

-రాజకీయ పార్టీలు అనుమతుల కోసం అవసరమైన పత్రాలు అందజేయాలి
-ఉల్లంఘనపై ఫిర్యాదులు చేసే విధానంలో 1950, సి విజిల్ యాప్ ను సద్వినియోగం చేసుకోవాలి
-సి విజిల్ యాప్ ద్వారా చేసే వారి విషయంలో గోప్యత పాటించడం జరుగుతుంది
-ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అందుబాటులో టోల్ ఫ్రీ నెంబర్
-ప్రింటింగ్ ప్రెస్ యాజమాన్యాలు ఎన్నికల కమీషన్ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలి
-గోడలపై ఎటువంటి రాతలు రాయకూడదు
-ప్రింటింగ్ ప్రెస్ యాజమాన్యాలు నిబంధనలు పాటించాలి
-ఎన్‌కోర్ ద్వారా 115 దరఖాస్తులు, 61కి ఆమోదం, 33 తిరస్కరణ
-జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** ఎన్నికల నిర్వహణా వ్యవస్థ నేపథ్యంలో జవాబుదారీతనం కలిగి ఉండేలా జిల్లాలో అన్ని విభాగాలను జాగురత చెయ్యడంతో పాటు సీజర్ (స్వాధీనం) , ఎన్ కోర్ మేనేజ్మెంట్ (అనుమతులు) మరియు సి విజిల్ కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతోందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా కె. మాధవీలత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.
ఎన్నికల ప్రక్రియలో(సీజర్) స్వాధీనం చేసుకున్న వాటి వివరాలు తెలియ చేస్తూ, ఏ ఒక్కరూ కూడా నగదు రూపంలో ?.50 వేలు మించి దగ్గర ఉంచుకొరాదని, ఒక వేళ పెద్ద మొత్తంలో నగదు ఉన్న యెడల తగిన ఆధారాలు తనిఖీలు నిర్వహించే అధికారులకి చూపించాలని అన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు నిడదవోలు నియోజక వర్గం పరిధిలో ముగ్గురు వ్యక్తులు రూ.2 లక్షలు , రూ. ఒక లక్షా 14 వేలు, రూ.6 లక్షల 30 వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రూ.3 లక్షల 14 వేలు విడుదల చెయ్యడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ప్రచారం కోసం వొచ్చే అభ్యర్థనలను 48 గంటల్లో మార్గదర్శకాలు మేరకు అనుమతులను సింగిల్ విండో విధానం ద్వారా జారీ చెయ్యడం, అసంపూర్తిగా ఉన్నా వాటినీ తిరస్కరించడం జరుగుతోందని అన్నారు.
**-ఎన్‌కోర్ :** సింగిల్ విండో విధానంలో సువిధాలో వస్తున్న దరఖాస్తులను పరిశీలించి మార్గదర్శకాల మేరకు అనుమతులను జారీ చేస్తున్నాం అని పేర్కొన్నారు. సక్రమంగా లేని వాటి విషయంలో తగిన సూచనలు చెయ్యడం జరుగుతోందని అన్నారు. సంబంధిత అధికారులు వాటినీ పరిశీలించి నిర్దారణ చెయ్యడం, అవసరమైన ధ్రువపత్రాలు పరిశీలించి ఆమేరకు అనుమతులను జారీ చేస్తున్నట్లు తెలిపారు. రాజకీయ పార్టీలు తప్పని సరిగా అనుమతుల కోసం అవసరమైన పత్రాలు అందజేయాల్సి ఉంటుందన్నారు. వాటినీ ఎన్ కోర్ యాప్ ద్వారా అప్లోడ్ చెయ్యాల్సి ఉంటుంది. జిల్లాలో ఇప్పటి వరకు 7 అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో ఎన్ కోర్ ద్వారా 115 అభ్యర్థనలు రాగా వాటిలో 61 కి అనుమతులు జారీ చేశామని, 33 తిరస్కరించగా , 14 పరిశీలనలో, 7 పెండింగ్ లో ఉన్నట్లు తెలిపారు. నియోజక వర్గాల వారీగా అనపర్తి 11 దరఖాస్తులలో 10 ఆమోదం, ఒకటి తిరస్కృతి, రాజానగరం 37 దరఖాస్తులు, 22 ఆమోదం,14 తిరస్కృతి, ఒకటి పెండింగ్ రాజమండ్రి సిటీ 30 దరఖాస్తులు,7ఆమోదం,11 తిరస్కృతి, 6 పరిశీలనలో, 6 పెండింగ్ రాజమండ్రీ రూరల్ 4 దరఖాస్తులు, 3 ఆమోదం, ఒకటి తిరస్కృతి కొవ్వూరు 7 దరఖాస్తులు, 5 ఆమోదం, 2 తిరస్కృతి , నిడదవోలు 17 దరఖాస్తులు, 10 ఆమోదం, 7 పరిశీలనలో 9 దరఖాస్తులు, 4ఆమోదం,4తిరస్కృతి,1పరిశీలనలోఉన్నట్లు తెలిపారు.
**– సి విజిల్ :** సి విజిల్ యాప్ ద్వారా ఆదివారం రాత్రి వరకు 182 ఫిర్యాదులు అందాయని, సోమవారం రాజమండ్రీ రూరల్ రెండు, నిడదవోలు నుంచి ఒక ఫిర్యాదు వొచ్చినట్లు మాధవీలత తెలియచేశారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు , ప్రజలు ప్రతి ఒక్కరూ జిల్లా యంత్రాంగానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందచేయాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయ ప్రకటనలు, ప్రచారం కోసం అనుమతులు తప్పనిసరి అని తెలియ చేశారు. ప్రచారం కోసం గోడలపై ఎటువంటి వ్రాతలు రాయకూడదు అని, అటువంటి వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుంది అని పేర్కొన్నారు.
**-ప్రింటింగ్ ప్రెస్ వారికీ:** వివిధ ప్రచారాలు నిమిత్తం ప్రింటింగ్ చేసే కరపత్రాలు, ఇతర ప్రచురణల సమాచారం ప్రజా ప్రాతినిధ్యం చట్టం 1951 లోని ఆర్టికల్ 127 ఏ మార్గదర్శకాలు ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ప్రచురించిన కరపత్రాలు సంఖ్య, ప్రింటర్ పేరు, చిరునామా లో తదితర సమగ్ర సమాచారం ముద్రించడం, మూడు రోజులలో ఆర్వో లకి నివేదికలు పంపించాలన్నారు.
**-ఎక్సైజ్, పోలీసు అధ్వర్యంలో..** మద్యం,గంజా, తదితర రవాణా లపై జిల్లాలో 7 చెక్ పోస్టులు ద్వారా తనిఖీలు, జిల్లాలో 63 ఫ్లైయింగ్ , సర్వైవల్ , వీడియో సర్వైవల్ బృందాలు తనిఖీలు నిర్వహించడానికి అనుగుణంగా కార్యచరణ రూపొందించడం జరిగిందన్నారు. ఎక్సైజ్, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో 65 దాడులు నిర్వహించి రూ.9 లక్షల 14 వేల ఖరీదైన 3,047 లీటర్లు మద్యం సీజ్ చెయ్యడం 72 మందిని అరెస్ట్ చేశామన్నారు. రు.,, లక్షా 69 వేల ఖరీదైన 33,800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశామన్నారు. డ్యూటీ పెయిడ్ మద్యం (అనధికార బెల్ట్ షాపులు) నిర్వహిస్తున్న 95 మంది పై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశామన్నారు. అందులో భాగంగా రు.2,27,183 లు విలువైన 672 లీటర్ల మద్యం సీజ్ చెయ్యడం జరిగిందన్నారు. గంజా కి చెందిన 3 దాడుల్లో 5 గురుని అరెస్ట్ చేసి, రూ.3,61, 550 విలువైన సుమారు 50 కేజీల గంజా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## ఆలయానికి వెళ్ళాను.. విచారణ జరిపాను



**కాకినాడ, మేజర్ న్యూస్ :** నగరంలోని దేవాలయం వీధిలో ఉన్న పెద్ద శివాలయంలో అర్చకులపై దాడి జరిగిన విషయం తనకు తెలిసిందని, సాయంత్రం ఆలయానికి వెళ్ళానని జిల్లా ఎండోమెంట్ ఆఫీసర్, సహాయ కమిషనర్ పులి నారాయణమూర్తి తెలిపారు. ఉదయం సంఘటన జరిగితే సాయంత్రం వెళ్ళాను అని అంగీకరించారు. నిందితుని దాడిలో గాయపడ్డ అర్చకుడు సాయి, ఈవో రాజేశ్వరరావు, ప్రధాన అర్చకుడు కార్తీక్ లతో మాట్లాడి విచారణ చేస్తున్న అని తెలిపారు. కానీ విచారణ నివేదిక ఏం చేశారు, విచారణలో ఏం జరిగింది? పోలీసులకు ఫిర్యాదు చేసిన పోలీసు అధికారితో మాట్లాడారా తదితర విషయాలు మాత్రం ఆయన బహిర్గతం చేయలేదు. తూతూ మంత్రంగా విచారణ జరిగినట్లు బాధితులు చెప్తున్నారు.

## రాష్ట్రాన్ని డ్రగ్ మాఫియా కేంద్రంగా మార్చేశారు



**అల్లవరం, మేజర్ న్యూస్ :** ఐదేళ్ల పాలనలో రాష్ట్రానికి డ్రగ్స్ మాఫియా కేంద్రంగా మార్చేశారని అమలాపురం తెలుగు మహిళా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి సోమవారం కోడూరుపాడులో జరిగిన మహిళల పత్రికా సమావేశంలో ఆరోపించారు. విశాఖపట్నంలో దొరికిన డ్రగ్స్ వైకాపా నాయకుడు కూనం పూర్ణచంద్రరావుకు చెందినవేనని ఆరోపించారు. దేశంలో ఎక్కడ గంజాయి దొరికిన ఆ మూలాలన్నీ జగన్మోహన్ రెడ్డి పాలన తీరు తెలియజేస్తున్నాయని, రాష్ట్రంలో ఏ పల్లెటూరికి వెళ్లిన కిళ్లీకొట్టులో కూడా గంజాయి, డ్రగ్స్ దొరుకుతున్నాయని, రాష్ట్రంలో ప్రభుత్వం విక్రయించే నాసిరకం మద్యం తాగడంతో రోజువారి కూలీలు ఇల్లు, ఒళ్ళు గుల్ల చేసుకుంటున్నారని, యువత డ్రగ్స్ బానిసలుగా మారారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అధికారి జయ వెంకటలక్ష్మి, వేగిరాజు ప్రవీన, గల్లా మేనకుమారి, పోతుల నాగలక్ష్మి, తోట శ్రీదేవి, కాండ్రేగుల వాణి అచ్యుతం, కదలి దుర్గా వరలక్ష్మి, మామిడిశెట్టి గంగాదేవి, రాయుడు సత్యమణి, దొమ్మేటి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీలో చేరిన జై భీమ్ భారత్ పార్టీ సభ్యులు



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** జై భీమ్ భారత్ పార్టీ సభ్యులు జగ్గారపు గణేష్ స్వామి భారతీయ జనతా పార్టీలో చేరినట్లు సోమవారం ప్రకటిం చారు. రాష్ట్రంలో బీజేపీ, జనసేన, టీడీపీ పొత్తులో భాగంగా అరకు పార్లమెంట్ అభ్యర్థిగా మాజీ పార్లమెంట్ సభ్యురా లు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొత్తపల్లి గీత పోటీ చేస్తున్న సందర్భంగా జై భీమ్ భారత్ పార్టీ సభ్యులు జగ్గారపు గణేష్ స్వామి హైదరాబాద్‌లో కొత్తపల్లి గీత నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా కొత్తపల్లి గీత కండువా కప్పి గణేష్ ను పార్టీలోకి ఆహ్వానించారు. త్వరలో జరగబోవు సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి అయిన కొత్తపల్లి గీత గెలుపు కోసం కృషి చేస్తామని గణేష్ తెలియచేశారు. ఇది వరకు బీజేపీలో పని చేసిన అనుభవం ఉందని గణేష్ పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో అరకు పార్లమెంట్ లో బీజేపీ పార్టీని బలోపేతం చెయ్యడానికి కొత్తపల్లి గీత ఆధ్వర్యంలో పని చేస్తామని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో గీత యువసేన సభ్యులు పలువురు పాల్గొన్నారు.

## సీతపల్లిలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలం సీతపల్లి గ్రామంలో ఉపాధ్యాయులు కలుం వీర్రాజు, భారతి దంపతులు ఆర్థిక సహాయంతో 11 అడుగుల భారీ అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. గిరిజన సంప్రదాయం ప్రకారం గిరిజన పూజారులు పల్లాల ఈశ్వర్ రెడ్డి, గూట్టేటి కృష్ణారెడ్డి చేతులు మీదగా హెూమం, ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా 101 బిందులతో స్వామివారికి జలాభిషేకం నిర్వహించడం జరిగింది. అలాగే భక్తులకు భారీ అన్నదానం నిర్వహించడం జరిగింది. గ్రామస్తులు కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్.ఎస్.ఎఫ్. జిల్లా సంయోజక్ గుడ్ల అంక శ్రీనివాసరెడ్డి, ప్రచారక్ కారం చెల్లన్న దొర, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గోవింద గిరి క్షేత్రంలో ఘనంగా లక్ష్మీ జయంతి





**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలం ఐ.పోలవరం గ్రామంలో గోవిందగిరి పై తిరుమల తిరుపతి దేవస్థానం వారు నిర్మించి నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో సోమవారం ఉదయం 9:30 గంటల నుండి లక్ష్మీ జయంతి (లక్ష్మీ అమ్మవారు ఉద్భవించిన రోజు) సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మావతి అమ్మవారికి విశేష అభిషేక సేవ వేద పండితులు శ్రీ సాయిరాంశర్మ ఘనపాటి వేదంతో ఆలయ ఆర్చకులు శ్రీపార్థస్వామి, ఆలయ సిబ్బంది మంగళ వాయిద్యాల నడుమ ఆలయ అధికారులు నారాయణ, శివరామ్, ఆలయ సిబ్బంది భక్తులుపాల్గొనగా అత్యంత అధ్భుతంగా జరిపించారు. కాగా ఫాల్గుణ పూర్ణిమ (హెూళి) సందర్భంగా రంపచోడవరంలో కోదండ రామాలయంలో విరాట్ విజయ ఆంజనేయస్వామి సన్నిధిలో సామూహిక పౌర్ణిమ హారతులు ఇవ్వడం జరిగిందని ధర్మ ప్రచారంలో భాగంగా ధర్మ ప్రచార సేవా భక్త మండలి సమన్వయ కర్త నల్లమిల్లి వేంకట రామారెడ్డి తెలియచేశారు.

## కడింపాడు గ్రామంలో జనసేన పార్టీలో చేరికలు



**పెరవలి, మేజర్ న్యూస్ :** కడింపాడు గ్రామంలో మార్చి 20వ తేదీ సోమవారం గ్రామ జనసేన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని యువకులు జనసేన పార్టీలో నూతనంగా జాయిన్ అయి పార్టీ కండువానికి కప్పుకున్నారు ఇటీవలే రాజమండ్రిలో నిడదవోలు టిడిపి బిజెపి జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి కందుల దుర్గేష్ సమక్షంలో కడింపాడు నుండి జనసేనలో నూతనంగా జాయిన్ అయిన దేవవరపు కేదారేశ్వర వెంకటరాయుడు దేవరపు ఏడుకొండలు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో గ్రామంలోని యువకులు పెద్ద ఎత్తున జనసేన పార్టీలో జాయిన్ అయ్యారు ఈ సందర్భంగా దేవరపు కేదారేశ్వర వెంకటరాయుడు మాట్లాడుతూ ఇప్పటివరకు తటస్థంగా ఉన్న తాము ఇటీవలే జనసేన నాయకులు కందుల దుర్గేష్ సమక్షంలో జనసేనలో జాయిన్ అవ్వడం జరిగిందని తమను స్ఫూర్తిగా తీసుకుని జనసేనకు మద్దతు ఇచ్చి జనసేన పార్టీలో జాయిన్ అయిన గ్రామస్తులను యువకులను ప్రత్యేకంగా అభినందించారు జనసేన లో కొత్త రక్తం తోడు అవటంతో కడింపాడు జనసేన కారుక్రమాలు చురుగ్గా ముందుకు సాగుతుంది అన్నారు గ్రామంలో ఏ విధమైన అభివృద్ధి కార్యక్రమం చేపట్టిన తన సహాయ సహకారాలు పూర్తిగా ఉంటాయని ఆయన కార్యకర్తలకు భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఆరేటి సూరిపండు,దేవరపు ఏడుకొండలు, టీడీపీ మరియు జనసేన పార్టీలకు చెందిన కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు .

# రమణీయం కమనీయం శ్రీనివాసుని కళ్యాణం



**ఎటపాక, మేజర్ న్యూస్ :** రమణీయం కమనీయం శ్రీనివాసుని కళ్యాణం. శ్రీ శ్రీనివాసుని కళ్యాణం వైభవంగా జరిగింది. తూర్పుగోదావరి జిల్లా ఎటపాక మండలం వెంకటరెడ్డి పేట, గుండాల కాలనీ గ్రామాల్లో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాలలో సోమవారం అంగరంగ వైభవంగా అలివేలు మంగ, పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర కల్యాణ మహెూత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీనివాసుని కల్యాణాన్ని కనులారా చూసి భక్తులు పరవశించిపోయారు. ఈ వేడుకను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఆలయం నుంచి అలివేలు మంగ, పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామివారిని పల్లకిలో ప్రత్యేకంగా కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. రక్షణ కంకణం, యజ్ఞోపవీతం చేసి బెల్లం, పెరుగు, తేనె కలిపిన నైవేద్యంతో మధుపర్కం కార్యక్రమం నిర్వహించారు. కల్యాణంలో ముఖ్య ఘట్టమైన అలివేలు మంగ, పద్మావతి వెంకటేశ్వర స్వామివారికి జీలకర్ర, బెల్లం పెట్టి అనంతరం మాంగళ్య ధారణ జరిపించారు. నూతన వధువు వరులకు భక్తులు కట్న కానుకలు సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కల్యాణ వేడుకను గొట్టుపుల్ల శ్రీనివాసాచార్యులు, ఆలయ కమిటీ నిర్వహణ, జీవి లక్ష్మి కుమార్ దేవస్థానం ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు రఘు పొంగువచార్యులు, గొట్టుపుల్ల రాజ్ గోపాల్ చార్యులు, పొడిచేతి అభిరామ చార్యులు, వరుణ్ చార్యులు నిర్వహించారు. భక్తుల కొరకు వెంకటరెడ్డి పేట వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భద్రాచలం కూరగాయల మార్కెట్, వెంకటేశ్వర రైస్ మిల్ యాజమాన్యం వెంకన్న, వెంకటరెడ్డిపేటలో, గుండాలకాలనీ ఆలయం వద్ద గూడూరు రామకృష్ణ (ఇసుక ర్యాంపు) ఏసుపాక వెంకటేశ్వర్లు, ఏసుపాక రాంబాబు మరియు కుటుంబ సభ్యులు అన్న దాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కల్యాణ మహెూత్సవం సందర్భంగా భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. వెంకటేశ్వర స్వామి ఆలయాల వద్ద ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎటపాక ఎస్సై పార్థసారథి ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మాదిరెడ్డి క్రిష్ణ బాబు, మాదిరెడ్డి మధు, మాదిరెడ్డి శ్రీనివాస్, మరియు బ్రదర్స్, ఇర్ప అజయ్, బొగ్గ వెంకటేష్, పాయం జోగయ్య, ఇర్ప సత్యం, సరియం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## చింతూరులో ఘనంగా అభయాంజనేయ స్వామి ఏకశిల విగ్రహ ప్రతిష్ఠ



**చింతూరు, మేజర్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్ కేంద్రంలో రామాలయం ప్రక్కన సోమవారం ఒబిల్లనేని రామారావు చౌదరి, కృష్ణవేణి దంపతులు మరియు కుటుంబ సభ్యులు అధ్వర్యంలో అభయాంజనేయ స్వామి ఏకశిల విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం ఘనంగా జరిగింది. స్థానిక పురోహితులు కేవిఎస్ఎన్ వరప్రసాద్, కోట చైతన్య రామాలయ పూజారి రవి, వేద పండితులు వలబోజుల రాకేష్, మహేష్ లు వేద మంత్రోచ్చారణలు, జయజయధ్వానాల మధ్య విగ్రహ ప్రతిష్ఠ వేడుకను వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకకు మండలంలోని భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిష్టా కార్యక్రమానికి వచ్చిన ప్రత్యేక అతిథులు హనుమాన్ విగ్రహం ప్రతిష్ఠాపన చేసుకోవడం శుభపరిణామమన్నారు. హనుమాన్ విగ్రహం ప్రతిష్ఠ రామాలయం ప్రక్కనే చేసుకోవడం చాలా సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పలు పార్టీల నాయకులు ఈ విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకల్లో పాల్గొని పూజలు చేశారు. అభయాంజనేయస్వామి ఏకశిల విగ్రహ ప్రతిష్ఠ జరుగడంతో వచ్చిన భక్తులు అందరికీ విగ్రహ దాత మరియు కుటుంబ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఒబిల్లనెని రామారావు చౌదరి, నరసింహరావు దంపతులు, పున్నేస్వరరావు దంపతులు, కుమార్తె గంగ భవాని దంపతులు, చిన్న కుమారుడు రవి, దూర ప్రాంతాల నుంచి వచ్చిన బంధుమిత్రులు, రామాలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# అంతర్రాష్ట్ర చెక్-పోస్టుల ఆకస్మికంగా తనిఖీ



**కాకినాడ, మేజర్ న్యూస్ :** యానాం – కాకినాడ జిల్లా సరిహద్దులోని అంతర్రాష్ట్ర చెక్–పోస్టులను కాకినాడ జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాబోవు సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నగదు, మద్యం, మాదక ద్రవ్యాలు ఇతర అక్రమ రవాణాను అరికట్టాలనే ఉద్దేశంతో, యానం – కాకినాడ జిల్లా సరిహద్దులలో ఏర్పాటుచేసిన అంతర రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టులను కాకినాడ జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ తనిఖీ చేసి సూచనలు చేశారు. సోమవారం సాయంత్రం కాకినాడ జిల్లా ఎస్పీ యానం సరిహద్దులో ఏర్పాటుచేసిన మల్లవరం, సుంకరపాలెం, మరియు అరటికాయలంక చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. ఈ చెక్‌పోస్టుల యందు పనిచేయుచున్న పోలీస్ అధికారులకు తగిన సూచనలు చేసి, నగదు, మద్యం, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడానికి పటిష్టమైన చర్యలు తీసుకొని ఈ మార్గాల్లో వచ్చే అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. నగదు, మద్యం అక్రమ రవాణా అరికట్టడానికి సెబ్ మరియు పోలీస్ అధికారులతో చర్చించి, వీటి అక్రమ రవాణాకు పటిష్ట చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. పటిష్టమైన సమాచార వ్యవస్థతో నగదు, మద్యం అక్రమ రవాణాను అరికట్టాలని అధికారులకు సూచించారు. చెక్‌పోస్టుల యందు పని చేయుచున్న అధికారులతో, సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని, చెక్పోస్టుల యందు వసతి సౌకర్యాలు మెరుగుపరచడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు, ప్రతి చెక్ పోస్ట్ నందు మంచి లైటింగ్, బారికెడ్లు ఏర్పాటు చేసినట్లు, రాత్రులందు సిబ్బంది వాహన తనిఖీ చేసేటప్పుడు సిగ్నల్ ల్యాంప్స్ , బాడీ రిఫ్లెక్టర్ జాకెట్స్ ను వాడటానికి వాటిని సరఫరా చేసినట్లు, అన్ని వసతులు సమకూర్చునుట్లు తెలిపినారు. అదేవిధంగా యానం ఎస్పీ తో చర్చలు జరిపి, యానం కాకినాడ సరిహద్దులో యానం వైపు 10 చెక్ పోస్టులను ఏర్పాటు చేసి వాటిని నిర్వహించుచున్నట్లు తెలిపినారు. అన్ని చెక్‌పోస్ట్ల యందు వీడియో కెమెరాలతో పటిష్ఠ నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## శ్రీ వనదుర్గ అమ్మవారి ఆలయంలో ప్రత్యంగిర హోమం



**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం క్షేత్ర పాలకురాలైన శ్రీ వనదుర్గ అమ్మవారి ఆలయంలో సోమవారం ప్రత్యంగిర హోమం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రతి నెలా పౌర్ణమి రోజున నిర్వహించే ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో దంపతులు పాల్గొని పూజలు చేశారు. వైదిక కమిటీ సభ్యులు పురోహితులు, అర్చకుల ఆధ్వర్యంలో జరిపించే ప్రత్యంగిరా హోమం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు సుదీర్ఘంగా రెండు గంటలపాటు నిర్వహించారు. పూజలో అన్ని రకాల పండ్లు, పూజా ద్రవ్యాలు కలిపి మూటగట్టి పూర్ణాహుతితో అగ్ని దేవునికి సమర్పించి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

## 15 లీటర్ల నాటు సారా స్వాధీనం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో నాటు సారాను నిర్మూలించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్సై యస్. శ్రీనివాసు సిబ్బందితో పేరవరం గ్రామ శివారున అక్రమంగా నాటు సారాను కలిగి ఉన్న రాజవరం గ్రామానికి చెందిన కోమలి నాగేశ్వరరావు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతను వద్ద నుండి 15 లీటర్ల నాటు సారాయిని స్వాధీన పరచుకుని కేసు నమోదు చేసి, కొత్తపేట కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపినారు.

# వైసిపి అరాచక దోపిడీ పాలన నుండి కాకినాడను కాపాడుకుందాం







**కాకినాడ, మేజర్ న్యూస్ :** వైసిపి రాక్షస పాలన నుంచి కాకినాడ నగరాన్ని కాపాడుకోవలిసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే తెలుగుదేశం జనసేన బీజేపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు పేర్కొన్నారు. సోమవారం కాకినాడ 9వ డివిజన్లో దుర్గమ్మ గుడిలో మాజీ ఎమ్మెల్యే కొండబాబు, బిజెపి నాయకులు పైడా భవాన ప్రసాద్, జనసేన నాయకులు సత్యనారాయణ నాయకులు కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం డివిజన్లో పర్యటించి తెలుగుదేశం కూటమి అమలు చేయబోయే సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించి కర పత్రాలను పంపిణీ చేసారు.

ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో గత ఐదేళ్ల కాలంగా విధ్వంసకర అరాచక అవినీతి దోపిడీ పాలన కొనసాగుతుందని, వైసిపి ప్రభుత్వం నిత్యవసర వస్తువులు ధరలను, ఇంటి పన్నులను, బస్ చార్జీలను విద్యుత్ ఛార్జీలను విపరీతంగా పెంచి, చెత్త పన్ను లను వేసి ప్రజల కష్టార్జితాన్ని జలగల్లా పట్టుకొని పీడించి దోచుకున్నారని, ప్రశాంత వాతావరణము గల కాకినాడ నగరాన్ని డ్రగ్స్ గంజాయి నగరంగా మార్చడంతో యువత భవిష్యత్తును చిదిమేస్తున్నారని, వైసిపి అరాచక పాలన నుండి ఆంధ్ర రాష్ట్రాన్ని కాకినాడ నగరాన్ని కాపాడుకోవాల్సిన అవసరం నేడు రాష్ట్ర ప్రజలపై కాకినాడ ప్రజలపై ఉన్నదని, వైసిపి ఐదేళ్ల అరాచక పాలనలో ప్రజలు తీవ్ర కష్టాలు పడ్డారని, గత తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కాకినాడ నగరాన్ని స్మార్ట్ సిటీగా ఎంపిక చేసి అభివృద్ధి పరచడం జరిగితే, వైసిపి పార్టీ నాయకుల స్వార్థ ప్రయోజనాలు కోసం, అక్రమ వ్యాపారాలు కోసం కాకినాడ నగర అభివృద్ధి తుంగలో తొక్కి దోచుకున్నారని, రాబోయే ఎన్నికల్లో కాకినాడ నగర ప్రజల ఆశీస్సులతో, తెలుగుదేశం బిజెపి జనసేన పార్టీ నాయకుల సహకారంతో భారీ మెజార్టీతో గెలిచి కాకినాడ నగరాన్ని మరింత అభివృద్ధి పరచడం జరుగుతుందని, త్వరలో జరగనున్న ఎన్నికల్లో తెలుగుదేశం జనసేన బిజెపి కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిని చేసుకుంటేనే మనం ప్రశాంతంగా జీవించగలమని, మనకు సుపరిపాలన లభిస్తుందని ప్రజలు భావిస్తున్నారని, రానున్న ఎన్నికలలో 175 నియోజకవర్గాల్లో టిడిపి జనసేన బిజెపి ఉమ్మడి అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలవడం జరుగుతుందని తెలిపారు.

బిజెపి సీనియర్ నాయకులు పైడా భవన్ ప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో అవినీతి పెచ్చుమీరిందని, ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్నవారిపై దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేశారని, దేశం రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి అధికారం చేపట్టవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పైడా వెంకటనారాయణ, పైడా భవన్ ప్రసాద్, మల్లిపూడు వీరు, డివిజన్ తెదేపా అధ్యక్షులు వాసంశెట్టి చిట్టప్ప, లూటుకుర్తి మోహన్, జనసేన నాయకులు తంగెళ్ల వి.వి సత్యనారాయణ, గీసాల పని, చోడిశెట్టి రమేష్, తుమ్మలపల్లి నాని, తంగెళ్ల రాముడు, పక్కి మణిబాల, కొక్కలగడ్డ గంగరాజు, గౌతు చిన్ని, వెంకన్న బాబు, పెంకె అప్పారావు, కట్టా సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సత్యదేవుని దర్శించుకున్న హైకోర్టు జడ్జి



**అన్నవరం, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా శంఖవరం మండలం అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి వ్రతం దర్శనార్థం ఢిల్లీ హైకోర్టు జడ్జి వి.కామేశ్వరరావు దంపతులు రత్నగిరికి సోమవారం విచ్చేశారు. ఆయనకు దేవస్థానం పిఆర్ఓ దామోర కృష్ణారావు, ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. ముందుగా శ్రీ స్వామివారి వ్రతమాచరించి శ్రీ స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా ఆలయ అధికారులు శ్రీ స్వామివారి శేష వస్త్రం, శ్రీ స్వామివారి ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, పిఆర్ఓ విభాగం గణపతి, అధికారులు, స్థానిక ఎస్సై కిషోర్ బాబు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గుబ్బల సత్యనారాయణ మూర్తి కి ఘన నివాళి



**అల్లవరం, మేజర్ న్యూస్ :** అల్లవరం మండలం కోడూరుపాడులో గుబ్బల సత్యనారాయణ మూర్తి (మాస్టారు) ప్రథమ వర్ధంతి సందర్భంగా సోమవారం అమలాపురం అసెంబ్లీ అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు, పార్లమెంట్ అభ్యర్థి గంటి హరీష్ మాధుర్ సత్యనారాయణ మాస్టారు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, పెచ్చెట్టి విజయలక్ష్మి, అధికారి జయ వెంకటలక్ష్మి, దెందుకూరి సత్యనారాయణ రాజు, నడింపల్లి సుబ్రహ్మణ్యం రాజు, మల్లుల పోలయ్య, వేగిరాజు వెంకటరాజు, బొర్రా ఈశ్వరరావు, కడలి వెంకటేశ్వరరావు, కాకిలేటి సూర్య ప్రకాశం, బండి గుప్తాపు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## అజ్జరం గ్రామం నందు గడప గడపకు కార్యక్రమం

-పాల్గొన్న నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస నాయుడు



**పెరవలి, మేజర్ న్యూస్ :** అజ్జరం గ్రామంలో మార్చి 25 వ తేదీ సోమవారం నిడదవోలు శాసనసభ్యులు జి శ్రీనివాస్ నాయుడు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు గ్రామంలో ప్రతి ఇంటికి తిరుగుతూ ప్రభుత్వ పథకాల అమలులో లోటుపాట్లను పరిశీలించారు ఈ కార్యక్రమంలోగ్రామ సర్పంచ్ సుదాభాషణం,గ్రామ పార్టీ అధ్యక్షులు వైయస్సార్ సిపి నాయకులు భాస్కర్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి కార్యకర్తలు,మండల ఎంపీపీ కార్చెర్ల సీతారాం ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు వీరమల్ల సత్యనారాయణ,సచివాలయం కన్వీనర్ రామడుగుల సూర్యనారాయణ, గృహ సారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కూటమి అభ్యర్థులదే కోనసీమ విజయం

- తెదేపా అమలాపురం పార్లమెంటు అభ్యర్థి హరీష్ బాలయోగి
- దాట్ల సుబ్బరాజుకి మద్దతుగా ప్రచారం





**అమలాపురం, మేజర్ న్యూస్ :** రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి అభ్యర్థులదే ఘన విజయయని తెలుగుదేశం పార్టీ అమలాపురం పార్లమెంటు అభ్యర్థి హరీష్ బాలయోగి పేర్కొన్నారు. కోనసీమ అభివృద్ధి తెలుగుదేశం సారథ్యంలో ఏర్పాటు కానున్న ప్రజా ప్రభుత్వం తోనే సాధ్యమని తెలిపారు. ఐ.పోలవరం మండలం గుత్తినవీధి గ్రామంలో ముమ్మిడివరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దాట్ల బుచ్చిబాబుకి మద్దతుగా ఆయన సోమవారం ఎన్నికలు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వైసీపీ అరాచక పాలనతో ప్రజలంతా విసిగి పోయారని విమర్శించారు. సంక్షేమ పథకాల పేరుతో లేనిపోని చెత్త పన్నులు వేసి, సామాన్యుడిని అప్పులపాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక యువత ఇతర రాష్ట్రాలకు వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులు మారి, ప్రజలకు సంక్షేమం, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీకే సాధ్యమని వివరించారు. ప్రజలంతా దీనిని గమనించి, కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## భారత్ & అమెరికా దేశాల సంయుక్త నావికాదళ విన్యాసాలు

- ఏర్పాట్లను పరిశీలించిన కాకినాడ జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఈ నెల 26వ తేదీ నుండి 31వ తేదీ వరకూ కాకినాడ నందు భారత నావికాదళము మరియు అమెరికా సంయుక్త రాష్ట్రాల నావికా దళాల సంయుక్త విన్యాసాలు కాకినాడ జిల్లా, కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట పాత ఎన్టీఆర్ బీచ్, నావల్ ఎన్క్లేవ్ నందు 'టైగర్ ట్రంప్' పేరిట నేవీ, ఆర్మీ కంబైన్డ్ ఎక్సర్‌సైజెస్ జరగనున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం కాకినాడ జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, కాకినాడ ఎస్‌డిపివో డా. కె.హనుమంతరావు, కాకినాడ రూరల్ సిఐ కె.శ్రీనివాస్ మరియు ఆర్మీ ఆఫీసర్లు పై ప్రదేశమును సందర్శించి, భారత నావి కాదళం, అమెరికా సంయుక్త రాష్ట్రాల నావిక దళాలకు రక్షణ కోసం తగు సూచనలు ఇవ్వడం జరిగినది. ఈ సంయుక్త విన్యాసాలలో భారత దేశ రక్షణ దళాలు మరియు యుఎస్‌కు చెందిన రక్షణ బలగాలకి చెందిన అధికారులు, సిబ్బంది సుమారు 800 మంది పాల్గొంటారని, అనేక యుద్ధనౌకలు, యుద్ధ ట్యాంకర్లతో విన్యాసాలు నిర్వహిస్తారని తెలియజేసారు. దేశ రక్షణ, భారత భూభాగంలో టెర్రరిస్టులు, శత్రువులు సముద్రమార్గాన వచ్చి దాడి చేసినప్పుడు వారిని ఏ విధంగా ప్రతిఘటించాలి, ఉగ్రవాద నిర్మూలన, శత్రు దేశాలతో యుద్ధ సమయంలో నిర్వహించే విన్యాసాలు నిర్వహిస్తారని తెలియజేసారు. ఈ నావికాదళ సంయుక్త విన్యాసాలు జరుగుతున్న కారణంగా ఉప్పాడ కొత్తపల్లి మండలం ఉప్పాడ సెంటర్ నుండి లైట్ హౌస్ వైపు బీచ్ రోడ్డులో మంగళవారం 26వ తేదీ నుండి 29వ తేదీ వరకూ వాహనాలకు అనుమతి లేదని, ట్రాఫిక్కును అచ్చంపేట జంక్షన్ మీదుగా పిఠాపురం వైపు మళ్ళించనున్నట్లు తెలియజేసినారు. ప్రజలు ఈ ట్రాఫిక్ మళ్లింపును గమనించి పోలీస్ శాఖకు సహకరించవలసిందిగా కోరినారు.

## ఒక యువకుడి మృతికి కారణమైన చిన్న వివాదం





ఎటపాక, మేజర్ న్యూస్ : చిన్న వివాదం ఒక యువకుడి మృతికి కారణం కాగా ఒక యువకుడి పరిస్థితి విషమంగా వుంది. ఎటపాక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హోలీ పండుగ సందర్భంగా సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం వెంకటరెడ్డి పేట గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం నిర్వహించడం జరిగింది. ఆ కల్యాణ మహోత్సవానికి వచ్చిన యువకులలో వెంకటరెడ్డి పేట గ్రామానికి చెందిన కొంతమంది యువకులు, భద్రాచలం పట్టణానికి చెందిన యువకుల మధ్య చిన్న వివాదం జరిగింది. దాంతో భద్రాచలం పట్టణానికి చెందిన ఇద్దరు యువకులు వెంకటరెడ్డిపేట గ్రామానికి చెందిన యువకులపై కత్తి తో దాడి చేయగా రామ్‌గోపాల్‌పురం గ్రామానికి అజ్మీరా సాయి కుమార్ (15) అనే యువకుడు మృతి చెందాగా ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల పిర్యాదు మేరకు ఎటపాక సీఐ రామారావు,ఎటపాక ఎస్సై పార్థసారథి సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయపడిన యువకులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

# ఏప్రిల్ 13 నుండి బృహతి సహస్ర యాగం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** మధ్వసభ కమిటి ఆధ్వర్యంలో ఏప్రిల్ 13, 14 తేదీలలో బృహతి సహస్ర యాగాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటి అధ్యక్షులు రాచూరి రాఘవేంద్ర స్వామి ప్రకటించారు. ఈ సందర్భంగా యాగ నిర్వహణపై తీసుకోవల్సిన విధివిధానాలతో కూడిన అంశాలను సమీక్షించేందుకు మధ్వసభ ప్రాంగణంలో సోమవారం కార్యవర్గ సమావేశం జరిగింది. స్వామి మాట్లాడుతూ ఉత్తరాధి మఠాధీశులు శ్రీసత్యాత్మతీర్థ స్వామీజీ ఆజ్ఞానుసారం మఠ ప్రత్యేక ప్రతినిధి, సుధాపండితులు కానుగోవి వాసుదేవాచార్ స్వీయ పర్యవేక్షణలో రెండు రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. 13న గణపతి పూజ, పుణ్యాహవాచనం, కలశ ప్రతిష్ట, దేవతాహ్వానము జరుగుతుంది. సాయంత్రం ఈ హోమ విశేషాలపై సుధాపండితులు విజయసింహాచార్ (రాజమండ్రి), రఘుప్రేమాచార్ (గుంటూరు), రఘోత్తమాచార్ (విజయనగరం), సుమంతాచార్ పాటిల్ (విజయవాడ) ప్రభృతులచే ప్రవచన కార్యక్రమం ఉంటుందన్నారు. 14న బృహతి యాగ హవనము, పూర్ణాహుతి, తీర్థ ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. కాకినాడ మధ్వసభ కమిటి ఏర్పడి 145 సంవత్సరాలు పూర్తవుతుందని, త్వరలో స్వామీజీ చేతుల మీదుగా ప్రత్యేక కార్యక్రమ నిర్వహణకు ఆలోచన చేస్తున్నామని రాచూరి స్వామి వివరించారు. మాధ్వగృహస్థులందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవల్సిందిగా విజ్ఞప్తి చేసారు. కార్యక్రమంలో డా॥ సుసర్ల రమణ, కార్యదర్శి కోపెల్ల శేషగిరిరావు, సంయుక్త కార్యదర్శి డా॥ యాతగిరి పరశురామ్, ఉపాధ్యక్షులు తాడూరి రంగారావు, కార్యవర్గ సభ్యులు రాచూరి శేషగిరిరావు, చిల్లరిగ ప్రసాద్, మొసలిగంటి సురేష్‌తో పాటు సభ్యులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రచారానికి అనుమతులకు సువిధ యాప్

**కాకినాడ, మేజర్ న్యూస్ :** పార్లమెంట్, శాసనసభ ఎన్నికలు 2024 లో పోటీచేసే అభ్యర్థులు తమ ఎన్నికల ప్రచారానికి అవసరమయ్యే అనుమతుల మంజూరుకు సువిధ యాప్ లేదా నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చునని కాకినాడ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారికి లేదా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వాహనాల అనుమతికి సంబంధించి దరఖాస్తుతో పాటు వాహన రిజిస్టేషన్ వివరాలు, డ్రైవింగ్ లైసెన్సు, వాహన యజమాని పేరు, డ్రైవర్ పేరు, చిరునామా, మొబైల్ నంబరు తదితర వివరాలు జత చేయాలని తెలి పారు. వాహనం సంచరించే ప్రదేశాల వివరాలు, రూట్ మ్యాప్ తెలియ జేయాలని పేర్కొన్నారు. మోటారు వాహన తనిఖీ అధికారి నుంచి వాహనాన్ని తనిఖీ సర్టిఫికేట్ పొందాలన్నారు. ర్యాలీలు, రోడ్ షోలు వంటి కార్యక్రమాలు అనుమతికి ప్రదేశం, రూట్ మ్యాప్, ర్యాలీలో పాల్గొనే వారి సంఖ్య, తేదీ, సమయం తదితర వివరాలను సంబంధిత రిటర్నింగ్ అధికారికి తెలియజేసి అనుమతి పొందాలన్నారు. బహిరంగ సభల నిర్వహణ సమయంలో వీఐపీ లేదా వీవీఐపీలు సందర్శన సమయంలో హెలిప్యాడ్ ఏర్పాటు అనుమతి కోసం జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ నుంచి అనుమతి కొరకు ముందుగా దరఖాస్తు చేయాలన్నారు. అనుమతుల కొరకు అభ్యర్థులకు సమయాన్ని ఆదా చేసి సరైన సమాచారాన్ని సువిధా యాప్ అందిస్తుందన్నారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత జవాబుదారీతనాన్ని ప్రోత్సహించడంలో సహాయ పడుతుందన్నారు. సువిధా యాప్ కోసం పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సువిధా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలియచేశారు. సువిధా పోర్టల్‌లో నేరుగా దరఖాస్తు చేసుకున్న వాటిని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు సాధ్యమైనంత తొందరగా సహేతుకమైన విధానంలో అనుమతులు జారీ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. అనుమతుల కొరకు నిర్దేశిత దరఖాస్తు ఫారంలో నింపి సమర్పించాలన్నారు. సువిధ యాప్ ద్వారా 19 రకాల అనుమతులు జారీ చేస్తామన్నారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిగేలా చూడడానికి ఈ యాప్ విలువైన సాధనమన్నారు. ఇంటింటి ప్రచారానికి కూడా అనుమతి ఉండాలని స్పష్టం చేశారు. ఇళ్లలో బ్యానర్లు, స్టిక్కర్లు అంటించాలంటే, ఆ ఇంటి యజమాని నుంచి అనుమతి ఉండాలని కాకినాడ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా తెలిపారు. తాత్కాలిక ఎన్నికల కార్యాలయం ఏర్పాట్లకు అనుమతి కోసం భవన యజమాని అనుమతి లేదా అద్దె వివరాలు, ఇతర అంచనా వ్యయం తదితర వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎలాంటి అనుమతి కోసమైనా కనీసం 48 గంటల ముందుగా దరఖాస్తు చేయాలని పేర్కొన్నారు. ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ప్రచార కార్య క్రమాలు నిర్వహించినా, వాహనాలను ప్రచారానికి వినియోగించినా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినట్లుగా పరిగణించి తగు చర్యలు తీసుకుంటామని కాకినాడ జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా స్పష్టం చేశారు.

# అల్లూరి నడయాడిన గడ్డపై పుట్టాను

-జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్..




**వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు నడయాడిన గడ్డపై పుట్టాను,గుండె చూపడమే కానీ వెన్ను చూపే చరిత్ర కాదని సి.పి.ఎం.పార్టీని ఒక్కసారి ఆశీర్వదించండని సి.పి.ఎం.పార్టీ రంపచోడవరం,రంపచోడవరం నియోజకవర్గ సి.పి.ఎం.పార్టీ అభ్యర్థి.లోతా రామారావు,కార్యకర్తలను కోరారు. సోమవారం సి.పి.ఎం.పార్టీ కార్యాలయంలో సి.పి.ఎం.పార్టీ మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, అధ్యక్షతన ముఖ్య కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంపచోడవరం నియోజకవర్గ ఉమ్మడి,అభ్యర్థి లోతా రామారావు, పరిచయ కార్యక్రమం. ఈ సందర్భంగా లోతా రామారావు మాట్లాడుతూ సహాసం అంటే సి.పి.ఎం.పార్టీ, అని ఊపిరి ఉన్నంత వరకు ప్రజల పక్షాన నిలబడి పోరాడుతుందని ఆయన తెలిపారు. కాంగ్రెస్, సి.పి.ఐ. బలపరిచిన సి.పి.ఎం.పార్టీ ఉమ్మడి అభ్యర్థిగా మీ ముందుకు వచ్చానని లోతా రామారావు, అన్నారు. సి.పి.ఎం.పార్టీ అంటే ఎర్ర ప్రభంజనమని కార్మికులు కర్షకులు, చిన్న, చిన్న,వర్తకులు కదిలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కామ్రేడ్ స్వర్గీయ కుంజా బొజ్జి,కామ్రేడ్ స్వర్గీయ సున్నం రాజయ్య,ఆశయ సాధన కోసం,పోటీలో నిలబడ్డానని ఆశీర్వదించండని,కోరారు. ఒక్క చాన్స్ ఇవ్వండి,ఏజెన్సీలోని రంపచోడవరం నియోజకవర్గాన్ని ఆంధ్రప్రదేశ్ చిత్రపటంలో గుర్తింపు తీసుకువస్తానని ఆయన అన్నారు. మీకు ఏకష్టం వచ్చినా! నేనున్నానని,ఆయన హామీఇచ్చారు. గత ఈపదేళ్ళలో ఆశ్రమ పాఠశాలను ఎత్తివేశారని గిరిజనులను,విద్యకు దూరం చేసేందుకు కుట్రలుచేశారని ఆయనవిమర్శించారు. మూతపడ్డ ఆశ్రమపాఠశాలను తెరిపించేందుకు సి.పి.ఎం.పార్టీ పోరాటం చేస్తుందని ఆయన అన్నారు. ఒక్కసారి మాట ఇస్తే నిలబెట్టుకోవడం కమ్యూనిస్టు పార్టీ,విధానం మని, మీకోసం నా చివరి రక్తపుబొట్టువరకు, ప్రాణం ఉన్నంత వరకు,పోరాడుతానని ఆయన అన్నారు. సి.పి.ఎం.పార్టీ జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, మాట్లాడుతూ లోతా రామారావు, పోరాటానికి కేరాఫ్,మీరు అందరూ చేయి,చేయి,కలిపి సి.పి.ఎం.పార్టీ అభ్యర్థి లోతా రామారావును, గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్నీ రంగాల్లో అభివృద్ధి సాధించేందు కృషిచేస్తారని ఆయన అన్నారు. ఈ సమావేశంలో సి.పి.ఎం.పార్టీ మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, జిల్లా నాయకులు పూ నెం సత్యనారాయణ, సీనియర్ నాయకులు సోడి మల్లయ్య, శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్,ఎం.పి.పి.కారం లక్ష్మీ, భారీగా కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## 16 సంవత్సరాలుగా చలివేంద్రంను దిగ్విజయంగా నడుపుతున్న అమ్మసాయి సేవా సంస్థ



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** జగ్గంపేటలో పోలీస్ స్టేషన్ వద్ద సర్కిల్ ఇన్స్పెక్టర్ మరియు సబ్ ఇన్స్పెక్టర్ వారి ఆధ్వర్యంలో చల్లటి మజ్జిగ చలివేంద్రం ప్రారంభోత్సవం చేశారు. 16 సంవత్సరాలుగా చలివేంద్రంను దిగ్విజయంగా అమ్మసాయి సేవా సంస్థ నడుపుతోంది. ఈ సందర్భంగా అమ్మ సాయి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు కొత్త శ్రీనివాసరెడ్డి ఉపాధ్యక్షుడు తోట చంద్రమోహన్, చంద్రమౌళి వెంకట శాస్త్రి, తోట వాసు, బు రా గంగరాజు,పల్లా రాము, భీమన లోవరాజు, గుణబత్తుల వాసు, రాజా, దున్న సురేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 25శాతం ఉచిత సీట్లకు గడువు పెంపు



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** విద్యా హక్కు చట్టం (ఆర్టీఈ) ప్రకారం ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్ల ప్రవేశాలకు దరఖాస్తుల గడువును పెంచినట్లు పిఠాపురం డీవై ఈవో ఆర్. జె. డి.రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఓసీ వర్గాల పేద పిల్ల లకు ఉచిత ప్రవేశాలకు ఈ నెల 25తో దర ఖాస్తుల గడువు ముగిసిందన్నారు. మరింత మందికి అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం దరఖాస్తుల గడువును ఈ నెల 31 వరకుపొడిగించిందని ఆయన ఒక ప్రకట నలో తెలిపారు. విద్యార్థుల నివాసానికి కి. మీ. దూరంలోని అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నారని ఆయన వివరించారు. ఆసక్తి ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు దరఖాస్తులను వెబ్సైట్ ద్వారా పంపించాలని సిబిఎస్ఈ సూచించారు. ఇతర వివరాలకు టోల్ ఫ్రీ నంబరు: 1800-4258-599ను సంప్రదించాలని డీవై ఈవో రాజు కోరారు.



# వైకాపాను మళ్లీ గెలిపించండి

## - ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు





**రామచంద్రపురం మేజర్ న్యూస్ :** వైఎస్ఆర్సిపి ఆత్మీయ సమ్మేళనం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో ద్రాక్షారామ సాయి మాధవానంద ఫంక్షన్ హాల్ నందు సోమవారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సమావేశానికి రామచంద్రపురం నియోజకవర్గానికి చెందిన పలువురు వైసిపి నాయకులు పిల్లి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో హసన్‌బాద నుండి భారీ బైక్ ర్యాలీతో తరలివచ్చారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభకు వెంకటాయపాలెం గ్రామ సర్పంచ్ యర్రమిల్లి సతీష్ కుమారి అధ్యక్షత వహించారు. ఈ సమావేశానికి తోట త్రిమూర్తులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి మళ్ళీ గెలుపొందడం ఖాయమని త్రిమూర్తులు జోష్యం చెప్పారు. సీఎం జగన్మోహన్ రెడ్డి ఎన్నికల హామీలు నూటికి నూరు శాతం అమలు పరిచారని ఆయన అన్నారు. ప్రతి పేద కుటుంబం తమ సంక్షేమ పథకాలు లబ్ధి పొందిందని నమ్మితేనే మళ్లీ ఓటు వేయమని ధైర్యంగా చెప్పిన సీఎం జగన్మోహన్ రెడ్డి ఒక్కరేనని ఈ సందర్భంగా తోట త్రిమూర్తులు అన్నారు.రామచంద్రపురం వైఎస్ఆర్ పార్టీ అభ్యర్థి సూర్య ప్రకాష్ ని తోట అభిమానులు, బోస్ అభిమానులు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే ఎంపీగా పోటీ చేస్తున్న రాపాక వరప్రసాద్ ని కూడా భారీ మెజార్టీ గెలిపించాలని ఈ సందర్భంగా తోట కోరారు. సూర్య ప్రకాష్ మాట్లాడుతూ వైయస్ స్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను చూసి నాకు ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సూర్యప్రకాష్ కోరారు. బోస్ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టని సంక్షేమ పథకాలు మన రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవేశపెట్టారని కరోనాకాలంలో కూడా ఇచ్చిన మాటకు కట్టుబడి సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారునికి జమ చేశారని అన్నారు. అలాగే ఎన్నికల హామీలను నూటికి నూరు శాతం అమలుపరిచిన నాయకుడు ఎవరైనా ఉన్నారంటే అది ఒక జగన్ మోహన్ రెడ్డి అన్నారు. తన కుమారుని ఏ విధంగా గెలిపిస్తున్నారు అదేవిధంగా మండపేటలో తోట త్రిమూర్తులను కూడా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బోస్ కార్యకర్తలకు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ చింతా అనురాధ. కొండేటి చిట్టిబాబు. వట్టికూటి వెంకట సుబ్రహ్మణ్యం (వెల్ల అబ్బు), తోట పృథ్వీరాజు, మున్సిపల్ చైర్పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి శ్రీధర్, ఎంపీపీ అంబటి భవాని, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజులు, పెమ్మిరెడ్డి మురళి, తోట బాబులు, పాముల సురేష్, వట్టికూటి రాజశేఖర్, కర్రి అబ్బు, తొగరు మూర్తి, ఎంపీటీసీలు గ్రామ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం స్వాధీనం, నిందుతుడి అరెస్ట్



**ధవళేశ్వరం, మేజర్ న్యూస్ :** ఎస్పీ ఆదేశాల మేరకు,సౌత్ జోన్ డిఎస్పి పర్యవేక్షణలో ధవలేశ్వరం ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం నుండి మద్యాన్ని రైలులో అక్రమంగా తెచ్చుకొని ధవలేశ్వరంలో మద్యాన్ని ఎక్కువ రేటుకు అమ్ముతున్న ఏలూరు సత్యనారాయణ వరప్రసాద్ తండ్రి సీతారామయ్య వయసు 70 సంవత్సరాలు కులం /పద్మశాలి,రామ పాదాల రేవు ధవలేశ్వరం అను అతనని అదుపులో తీసుకొని, తెలంగాణ మందు మాన్షన్ హౌస్ ఫుల్ బాటిల్స్ -6,మెక్డోవేల్స్ -4 ఫుల్ బాటిల్స్ మరియు . క్యాష్ 900. నగదు సీజ్ చేయటం జరిగింది. ఎస్సై క్రాంతి కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుంది.

## రన్ ఫర్ జీసస్

## టీ షర్ట్స్, క్యాప్స్, జెండాలు ఆవిష్కరణ




**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలోలో ఈ నెల 30 వ తేదీన జరగబోయే రన్ ఫర్ జీసస్ కార్యక్రమం కొరకు ఏర్పాటు చేసిన టీ షర్ట్స్, క్యాప్, జెండాలు ను నేతుల మెమోరియల్ లూథరన్ చర్చ్ లో ప్రార్ధన చేసి సోమవారం ఆవిష్కరించారు.30 వ తేదిన ఉదయం 6 గంటలకు , సేవకులు,పెద్దలు, నాయకులు,విశ్వాసులు, యూత్ వారు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కో ఆర్డినేటర్ రెవ. డా. పురుషోత్తం దాస్ లంక తెలియచేసారు. ఈ కార్యక్రమంలో బిషప్. డా. సి. బి. ఐ. సుకుమార్, రెవ. జె. జోసెఫ్ కుమార్, బ్రదర్ ఎన్. ఇమ్మానియేల్ సహాయం, రెవ. జి. చందు స్టీఫెన్, బ్రదర్. పి. చిన్ని పాల్గొన్నారు.

## నటనా రంగంలో బాలనటి వెంకట శ్రీ ప్రణవికి బంగారు నంది పురస్కారం

-వెంకట శ్రీ ప్రణవిని, ప్రోత్సహించిన మేనమామ సత్యనారాయణకు పలువురు అభినందనలు







**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలం చెదలాడ గ్రామానికి చెందిన బాలనటి గా ప్రతిభ కనబరిచిన పలివెల వెంకట శ్రీ ప్రణవి కి బంగారు నంది పురస్కారం దక్కింది. చిన్నప్పటి నుంచి టివిల్లో వచ్చే సీరియల్స్, సినిమాలలో చిన్న పిల్లలు నటించే విధానం చూసి తాను కూడా ఎప్పటికైనా నటించాలని అనుకుంది. తనకు తానే అభినయం చేస్తూ కుటుంబ సభ్యులను అలరించింది పలివెల వెంకట శ్రీ ప్రణవి. పెద్దాపురం మండల దివిలి లిఖిత స్కూల్లో 8వ తరగతి చదువుతూ.. తాను చదివే పాఠశాలలో, గ్రామాల్లో పండుగల్లో జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని తన నృత్యం, డాన్స్,నటనా చాతుర్యంతో బహుమతులను గెలుచుకుని బాల నటిగా మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఎప్పటికైనా సినిమాల్లో తనకంటూ ఓ స్థానం కల్పించుకోవాలన్న తపన తన మేనమామ సర్పవరం ఏపీ ఎస్ ఈ బిలో విద్యుత్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న ఓ బ్బిలిశెట్టి సత్యనారాయణ ద్వారా డైరెక్టర్ వై.ఆర్. చౌదరికి పరిచయం కావడంతో వ్యూహం..కి ప్రతి వ్యూహం సినిమాల్లో బాల నటిగా అవకాశం వచ్చింది. ఈ నెల హైదరాబాద్ లో బిల్లా ఆడిటోరియంలో జరిగిన శ్రీ విఘ్నేశ్వరా ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణా ఆర్ట్స్ కల్చరల్ అవార్డ్స్ ప్రధానోత్సవంలో బంగారు నంది అవార్డును కైవసం చేసుకుని మన ఫిలిం చాంబర్ చైర్మన్ జె.ఎన్.రాజేంద్ర, సినిమా హీరో కార్తికేయ, హీరోయిన్ దీపికల చేతుల మీదుగా అవార్డు అందుకున్నది శ్రీవెంకట ప్రణవి. రైతు కుంటుంబానికి చెందిన పలివెల సుబ్రహ్మణ్యం, వరలక్ష్మి దంపతుల కుమార్తె శ్రీప్రణవి నటనలో రాణిస్తున్నందుకు తాత ఒబిలిశెట్టి నాగేశ్వరరావు, మేనమామ సత్యనారాయణ, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించిన వారిలో ఉన్నారు. అలాగే వెంకట శ్రీ ప్రణవి తన మేనమామ సత్యనారాయణ, ప్రాద్బలంతో ప్రముఖ సినీ డైరెక్టర్ వై. ఆర్. చౌదరి ఆధ్వర్యంలో రానున్న పలు చిత్రాల్లో నటించనున్నది, దీనితోపాటు సినీ చిత్ర సీమలో త్వరలో ప్రముఖ పెద్ద హీరోల చిత్రాల్లో కూడా బాలనటిగ నటించనున్నది. ఈ సందర్భంగా వెంకట శ్రీ ప్రణవి మేనమామ సత్యనారాయణ తన మేనకోడలు పట్ల చూపిస్తున్న శ్రద్ధను చూసి పెద్దాపురం మండలంలోనే కాకుండా జిల్లాలోని పలువురు సత్యనారాయణను అభినందిస్తున్నారు.

## అంబేద్కర్ సేవా సమితి కమిటీ ఏర్పాటు

**ద్వారకాతిరుమల,మేజర్‌న్యూస్:** భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ సేవాసమితి కమిటీని ఏర్పాటు చేశారు. అంబేద్కర్ సేవా సమితి సభ్యులు ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేశారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పెనుమాల శ్రీనివాసు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత ఆయన సాధనాలు కోసం మనమందరం కలిసికట్టుగా పనిచేయాలి అలాగే ఎవరికి ఏ సమస్య వచ్చినా కలిసికట్టుగా పని చేద్దామని తెలిపారు.సేవా సమితి కమిటీ లింగాల ఏసు గౌరవ అధ్యక్షులు పెనుమాల శ్రీనివాసు అధ్యక్షులు,పెనుమాల ఈశ్వరుడు, గుంట రాము, కాలనీ గ్రామస్తులు పాల్గొన్నారు.

## మండలంలో అభివృద్ధి జరగాలంటే సి.పి.ఎం పార్టీ గెలవాలి



**వి.ఆర్.పురం, మేజర్ న్యూస్ :** మండలంలో అభివృద్ధి జరగాలంటే సి.పి.ఎం,పార్టీతోనే సాధ్యమని సి.పి.ఎం,పార్టీ జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అన్నారు. మండలంలోని రేఖపల్లి గ్రామంలో సి.పి.ఎం,పార్టీ కార్యాలయం,ఆవరణలో సి.పి.ఎం.పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాలు పులిసంతోష్ కుమార్ అధ్యక్షతన జరిగాయి.ఈ కార్యక్రమంలో సి.పి.ఎం,పార్టీ జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, మాట్లాడుతూ 4మండలల్లో పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలనే ఆలోచన అధికార పార్టీకి గానీ,ప్రతిపక్ష పార్టీలకు లేవని ఆయన విమర్శించారు.ఆపార్టీ లు నిర్వాసితుల పక్షాన పని చేయవని, నిర్వాసితుల సమస్యల కోసం మొదటి నుండి పోరాడుతుంది సి.పి.ఎం,పార్టీ అని ఆయన అన్నారు.పోలవరం నిర్వాసితులకు న్యాయం జరగాలంటే సి.పి.ఎం,పార్టీ ప్రజా ప్రతినిధి అసెంబ్లీలో ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. సి.పి.ఎం, కార్యదర్శి వర్గ సభ్యులు లోతా రామారావు మాట్లాడుతూ అధికార,ప్రతిపక్ష, పార్టీల నాయకులు డబ్బుతో గెలిచారని డబ్బుల కోసం పని చేస్తారని,ఆయన ఆరోపించారు. ప్రజలకోసం పని చేసేది ఒక్క కమ్యూనిస్టు పార్టీలేనని,ఆయన గుర్తుచేశారు.రంపచోడవరం, భద్రాచలం నియోజకవర్గ ప్రజా ప్రతినిధుల పని తీరును చూస్తే ఆ కృషి ఇక్కడ సి.పి.ఎం,పార్టీ ఎమ్మెల్యేలుకుంజాబొజ్జి, సున్నం రాజయ్యల పనితీరు అద్భుతం మని ఆయన అన్నారు. గత పదేళ్లలో ఈనియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి శున్యం. మళ్ళీ సి.పి.ఎం,పార్టీ ప్రజా ప్రతినిధి రంపచోడవరం నియోజకవర్గంలో గెలిస్తేనే అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. వరరామచంద్రాపురం మండలంలో ఉన్న పాఠశాలలు, ఆసుపత్రులు, రోడ్ లు, మంచినీటి పథకాలు, ఎత్తి పోతల పథకాలు లాంటి అభివృద్ధి కార్యక్రమాలు ఏమండలంలో జరగలేదు. రంపచోడవరం 7మండలాల్లో అధికార,ప్రతిపక్ష, ప్రజాప్రతినిధులను చూసి ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. కావున ప్రజలంతా అలోచించి మళ్ళీ సి.పి.ఎం,పార్టీ కి అవకాశం ఇవ్వాలని కోరారు. సి.పి.ఎం, జిల్లా సభ్యులు పూనెం సత్యనారాయణ మాట్లాడుతూ సి.పి.ఎం, ప్రజా ప్రతినిధులు మాత్రమే సమస్యల పరిస్కారంకోసం పోరాడుతుందని అన్నారు, జి ఓ 3 రద్దుకు వ్యతిరేకంగా, బోయ, వాల్మీకి, లను ఎస్టి జాబితాలో చేర్చుతమంటే దానికి వ్యతిరేకంగా పోరాడింది సి.పి.ఎం,పార్టీ అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి సోయం. చిన్నబాబు ఎంపీపీ కారం. లక్ష్మి ,కుంజా నాగిరెడ్డి, వడ్లది రమేష్. తోడం రాజు. ఖాదర్. కొండారెడ్డి. లక్ష్మణరావు ఎటపాక మండల నాయకులు మిరప అజయ్ కాంతారావు,తాతబాబు, వాళ్ల కృష్ణారెడ్డి సోడి మల్లయ్య,కటకాల సరోజిని, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సత్తిరెడ్డి మృతి పట్ల పలువురు సంతాపం



**అనపర్తి, మేజర్ న్యూస్ :** అనపర్తి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సత్తి వెంకటరెడ్డి సోదరుడు సత్తి సత్తిరెడ్డి గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల వరకు మిత్రులతో గడిపిన సత్తిరెడ్డి ఇంటికి చేరుకున్న అరగంటలో గుండెపోటు రావడంతో హఠాత్తుగా మృతి చెందడం అందరి హృదయాలను కలచి వేసింది. సత్తిరెడ్డి మృతి పట్ల ఆయన కుటుంబ సభ్యులకు పలువురు ప్రముఖులు సంతాపం తెలిపి ప్రగాఢ సానుభూతి తెలిపారు.సంతాపం తెలిపిన వారిలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ఆదిలక్ష్మి దంపతులు, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు), జడ్పిటిసి సత్తి గీతా వరలక్ష్మి వెంకటరెడ్డి, వైసిపి అనపర్తి పట్టణ అధ్యక్షులు నల్లమిల్లి మురళీమోహన్ బాలకృష్ణా రెడ్డి, సొసైటీ అధ్యక్షులు కర్రి రామన్నతాత, ప్రముఖ నేత్ర వైద్యులు తేతలి సత్యనారాయణ రెడ్డి, ప్రముఖ వైసిపి నేత నల్లమిల్లి వెంకటరెడ్డి (నేషనల్),టిడిపి మండల అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (దత్తుడు శ్రీను),పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కర్రి వెంకటరామారెడ్డి తదితరులు ఉన్నారు.

## బేరింగ్ మరమ్మతులు వల్ల వైబ్రేషన్స్ గుర్తించడం జరిగింది

**-సాంకేతిక నిపుణుల అభిప్రాయం మేరకు బేరింగ్‌లను మార్చడం జరుగుతుంది**
**- క్షేత్ర స్థాయిలో ఉన్నత స్థాయి అధికారులతో గామన్ వంతెన పరిశీలన**
**-సబ్ కలెక్టర్ కార్యాలయంలో ట్రాఫిక్ మళ్లింపుపై అధికారులకి దిశా నిర్దేశనం**
**-హాజరైనా ఆర్ అండ్ బి, పోలీస్, రెవెన్యూ అధికారులు**
**-ముఖ్య కార్యదర్శి పి ఎస్ ప్రద్యుమ్న**



**రాజమహేంద్రవరం / కొవ్వూరు, మేజర్ న్యూస్ :** గమన్ బ్రిడ్జి పై మరమ్మత్తులకు గురైన ప్రాంతాన్ని పరిశీలించడం జరిగిందని రాష్ట్ర రవాణా, రోడ్లు భవనాలు ముఖ్య కార్యదర్శి పి ఎస్ ప్రద్యుమ్న తెలిపారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ డా కే. మాధవీలత , ఎస్పి పి. జగదీష్, ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ మరియు రాష్ట్రా రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎల్. శ్రీనివాస రెడ్డి, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్, ఈ ఈ - ఏ. శ్రీకాంత్, ఆర్ అండ్ బీ ఈ ఈ ఎస్బివి రెడ్డి, డి ఈ బివివి మధుసూధన్ రావు, డిఎస్పీ కే సి హెచ్ రామా రావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం లో అధికారులతో సమీక్షించారు

ఈ సందర్భంగా ముఖ్య కార్యదర్శి పి ఎస్ ప్రద్యుమ్న మాట్లాడుతూ , గామన్ బ్రిడ్జి కి చెందిన సాధారణ తనిఖీల్లో భాగంగా నిర్వహణ సంస్థ 56 - 57 మధ్య స్పాన్ వద్ద సాంకేతిక పరమైన లోపం గుర్తించడం జరిగిందన్నారు. వాహనాలు వెళుతున్న క్రమంలో వైబ్రేషన్స్ అధిక స్థాయి లో ఉన్నట్లు తెలిపారు. ఆ నేపధ్యంలో తక్షణ మరమ్మత్తులకు చర్యలు తీసుకోవడం జరుగుతోందని తెలియ చేశారు. కేవలం బెరింగ్ లు మాత్రమే దెబ్బ తినడం జరిగిందనీ, వంతెన భద్రత కు ఎటువంటి ఇబ్బందీ లేదనీ స్పష్టం చేశారు. బేరింగ్ అందుబాటులో ఉంటే నాలుగైదు రోజుల్లో పనులు చేపట్టడం జరుగుతుందనీ అన్నారు. ఒక వేళ అందుబాటులో లేని ఎడల ఈ వంతెన కు అనుగుణంగా బే రింగ్ తయారు చెయ్యాల్సి ఉంటుందనీ, అవి కలకత్తా లో వాటి తయారు చేసే కంపెనీలు ఉన్నట్లు తెలిపారు. రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించడం, ఆమేరకు ఇంజనీరింగ్ అధికారుల సూచనల మేరకు తదుపరి కార్యాచరణ అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, ట్రాఫిక్ సమస్య ఉత్పనం కాకుండా ఒక వైపు నుంచే రాను పోను వాహనాలను అనుమతించ నున్నట్లు తెలియ చేశారు. సాధ్యమైనంత తొందరగా మరమ్మత్తులు పూర్తి చేసి యధావిధిగా ట్రాఫిక్ రెండూ వైపులా అనుమతించనున్నట్లు మాధవీ లత పేర్కొన్నారు. వాహనదారులు అధికారులకి, పోలీసులకు సహకారం అందించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ పర్యటన లో జిల్లా కలెక్టర్ మాధవీలత, ఎస్పి పి. జగదీష్ , ఆర్డీసి ఎండి ఎల్. శ్రీనివాస రెడ్డి తదితరులు గామన్ బ్రిడ్జి పై చెయ్యవలసిన పనులు ప్రత్యక్షంగా పరిశీలించడం జరిగిందని అన్నారు. తదుపరి ట్రాఫిక్ మళ్లింపు చర్యలు పై పోలీసు, రహదారుల, టోల్ గేట్ అధికారులతో సమీక్షించారు

## అంబాజీపేటలో అభ్యర్థుల పరిచయాలు



**అంబాజీపేట, మేజర్‌న్యూస్ :** ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీల అభ్యర్థులునాయకుల పరిచయ కార్యక్రమాలు ఊపందుకు న్నాయి. అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి ఉమ్మడి అభ్యర్థి గంటి హరీష్ మాధుర్ సోమవారం అంబాజీపేటలో పర్యటించారు. మాచవరం శ్రీయువ గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కొర్లపాటివారి పాలెం లో వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం మాధుర్ ను తెలుగుదేశం పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. అలాగే వెంకట్రాజు ఆయిల్ మిల్ వద్ద జరిగిన కార్యక్రమంలో పి.గన్నవరం నియోజకవర్గ జనసేన, టిడిపి, బిజెపి కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ తెలుగుదేశం నాయకుల పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన పార్టీ నాయకులతో పరిచయాలు జరిగాయి.

## తెలుగుదేశం మాలలపై చిన్నచూపు చూస్తోంది

-ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఒక్క సీటు కేటాయించని వైనం
- బొంతా శ్యామ్‌రవిప్రకాష్ ఆవేదన
- చంద్రబాబు పునరాలోచన చేయాలని సూచన



**గోపాలపురం, మేజర్ న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీలో మాలలకు తీరని అన్యాయం జరిగిందని మాల మహాసభ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ బొంతా శ్యామ్‌రవిప్రకాష్ పేర్కొన్నారు. సోమవారం గోపాలపురంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉభయ పశ్చిమగోదావరి జిల్లాలో మూడు ఎస్సీ నియోజకవర్గాలు ఉన్నాయని ఒక్క నియోజకవర్గంలో కూడా మాలలకు సీటు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. గోపాలపురం నియోజకవర్గంలో సుమారు 40 సంవత్సరాలు నుండి ఒక్కసారి కూడా మాలలకు టీడీపీ టికెట్ ఇవ్వలేదని ఇది మాలల ఆత్మగౌరాన్ని కించపరిచే విధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గోపాలపురంలో తెలుగుదేశం పార్టీ మాదిగ సామాజిక వర్గానికి చెందిన మద్దిపాటి వెంకటరాజుకు టికెట్ కేటాయించిందని అక్కడ కూడా మాలలకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. మద్దిపాటిపై టీడీపీలోని నాయకులు కార్యకర్తలు వ్యతిరేకిస్తున్నారని అయినప్పటికీ అధిష్టానం ముందుగా పోయి ఆ అభ్యర్థిని గెలిపించుకునేందుకు పార్టీ క్యాడర్ పై తీవ్ర ఒత్తిడి తీసుకురావడం బాధాకరమన్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పి.గన్నవరం నియోజకవర్గాన్ని టీడీపీ సరిపెల్ల రాజేష్‌కు కేటాయించగా అక్కడివారు ఇతడు స్థానికుడు కాదని పైగా మాదిగ సామాజిక వర్గానికి చెందిన వాడని ఆందోళన చేయగా ఆ సీటును జనసేనకు కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. అదే విధంగా బాపట్ల ఎస్సీ పార్లమెంట్ స్థానాన్ని తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్రానికి చెందిన తెన్నేటి కృష్ణ ప్రసాద్ కేటాయించాలని చెందిన వ్యక్తిని దీంతో అక్కడ మాల సామాజిక వర్గం తమ ఓట్లను తెలుగుదేశం పార్టీ కాకుండా మాల సామాజిక వర్గానికి చెందిన జేడీ సేలం కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. టీడీపీ తమ తప్పిదాలను సరిచేసుకుంటే ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను మాల సామజ వర్గానికి చెందిన ఓట్లను తెలుగుదేశం పార్టీ పొందుతుందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో మాలల జనాభా అధికంగా ఉన్నారని పశ్చిమగోదావరి జిల్లాలో ఉన్న చింతలపూడి గోపాలపురం కొవ్వూరు నియోజకవర్గంలో మాలలు అధికంగా ఉన్నారని వారిని విస్మరించడం టీడీపీ, బీజేపీ జనసేన కూటములకు తగదని ఆయన పేర్కొన్నారు. సామాజిక న్యాయం కోసం మాట్లాడే రాజకీయ పార్టీలు మాలలు విస్మరించడం ద్వారా తమ వైఖరి తేటతెలమవుతుందని పేర్కొన్నారు. మాల సామాజిక వర్గానికి అన్యాయం చేస్తూ వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు దొడ్డి వెంకటేశ్వర్లు, చోళ తమ్ముడు శ్రీను, మరపట్ల హరీష్ తదితరులు పాల్గొన్నారు.